వైద్యం.. సత్వరం

- పీహెచ్‌సీల్లో 65 రకాల వైద్య పరీక్షలు
- పరికరాలు సమకూర్చిన గత ప్రభుత్వం
- శిక్షణ పొందిన ల్యాబ్ టెక్నీషియన్లు



గుడిపాల పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయడానికి గత ప్రభుత్వం సమకూర్చిన అధునాతన పరికరాలు

గుడిపాల: గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే 65 రకాల వైద్య పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. ఇందుకోసం వైద్య, ఆరోగ్యశాఖ అధునాతన యంత్ర పరికరాలను పీహెచ్‌సీలకు అందజేసింది. ఒక్కో పీహెచ్‌సీకి సీబీసీ, ఎలక్ట్రొలైట్ ఎనలైజర్, బయోకెమిస్ట్రీ ఎనలైజర్, యూరిన్ ఎనలైజర్, టీబీ ఆర్టీ పీఆర్ యంత్ర పరికరాలను సమకూర్చారు. అప్పటివరకు పీహెచ్‌సీల్లో కేవలం 15 నుంచి 20 రకాల వైద్య పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉండేవి. కొత్తగా చేరిన పరీక్షలతో కలిపి వాటి సంఖ్య 65కు పెరిగింది. వైద్య పరీక్షల నిర్వహణ కోసం ప్రతి పీహెచ్‌సీకి ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను కూడా నియమించారు. చిత్తూరులో 22 రోజుల పాటు ల్యాబ్ టెక్నీషియన్లు శిక్షణ కూడా పొందారు.

ఎంతోమేలు

మూడేళ్లకు ముందు పీహెచ్‌సీలలో చాలా రకాల వైద్య పరీక్షలు అందుబాటులో లేకపోవడంతో వాటి కోసం రోగులు సమీప ఏరియా ఆసుపత్రి, లేదా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. ఇది సహజంగానే రోగులకు ఆర్థిక భారం పెరిగిపోయేది. అదనంగా శ్రమ పడాల్సి వచ్చేది. దీనివల్ల రోగ నిర్ధారణకు ఎక్కువ సమయం పట్టేది. అప్పటి వరకు రోగికి ఖచ్చితమైన వైద్యం అందేది కాదు. పరీక్షల కోసం దూరప్రాంతాలకు వెళ్లలేని కొందరు పేద రోగులు సైతం ప్రైవేట్ ల్యాబ్‌లను ఆశ్రయించేవారు. ప్రస్తుతం అదనపు వైద్య పరీక్షలు పీహెచ్‌సీల్లోనే అందుబాటులోకి రావడంతో కొన్ని గంటల వ్యవధిలోనే రోగుల వ్యాధి నిర్ధారణకు వీలవుతుంది. ఫలితంగా వెంటనే రోగికి మెరుగైన వైద్యసేవలు అందించడానికి అవకాశం కలుగుతుందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాలసూర్యనారాయణ తెలిపారు.

అందుబాటులో ఉన్న వైద్య పరీక్షలు

సీఆర్‌పీ, ఎస్‌జీఓటీ, ఎస్‌జీపీటీ, యూఆర్‌ఈఏతో పాటు హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్ కౌంట్, సీబీసీ, లోటస్‌బ్లడ్ సెల్‌కౌంట్, ర్యాండమ్‌బ్లడ్ షుగర్, బ్లడ్ యూరియా, సీరం సోడియం, హెచ్ఐవీ, హైపటైటిస్-బి, డెంగీ, బ్లీడింగ్, క్లాటింగ్‌టైమ్, థైరాయిడ్, పొటాషియం, క్లోరైడ్ తదితర 65 రకాల పరీక్షలు చేయనున్నారు.

అందుబాటులో వైద్య పరీక్షలు



65 రకాల వైద్య పరీక్షలు రోగులకు అందుబాటులో ఉన్నాయి. ఇకపై పరీక్షల కోసం పట్టణ ప్రాంతాలకు పేద రోగులు వెళ్లనవసరం లేదు. త్వరగా రోగ నిర్ధారణ అవుతుంది. వెంటనే అవసరమైన వైద్యాన్ని అందిస్తాం. ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పనిలేకుండా ప్రభుత్వం ప్రభుత్వ అసుపత్రిలోనే అన్ని సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నది.

– సంధ్య, పీహెచ్‌సీ డాక్టర్, గుడిపాల

శిక్షణ ఇచ్చారు



రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలు, మెషినరీ పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయి. వైద్య పరీక్షలు ఎలా చేయాలో ప్రాథమికంగా శిక్షణ ఇచ్చారు. పీహెచ్‌సీల్లో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నాం.

– వెంకటేష్, ల్యాబ్ టెక్నీషియన్, గుడిపాల

క్లుప్తంగా

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలు

యాదమరి: గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైనటువంటి వైద్యసేవలను అందిస్తున్నామని వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్ అన్నారు. ఆయన సోమవారం మండల ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొట్టాలం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతివారం తమ ప్రాంతాలకే 104 సంచార వాహనం ద్వారా వైద్య సిబ్బంది వస్తారని చెప్పారు. ఎటువంటి ఖర్చులు లేకుండా వైద్య పరీక్షలు నిర్వహించి ఏ వ్యాధికి ఎటువంటి మందులు ఇవ్వాలో అవసరమైన వారికి అందజేస్తామని చెప్పారు. అనంతరం స్థానిక గర్భిణులను పరీక్షించి..పోషక ఆహారాలను తీసుకోవాలని, క్రమం తప్పకుండా వైద్య సేవలు చేసుకోవాలని చెప్పారు. ప్రసవం కోసం ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవడం వల్ల తల్లీ బిడ్డ సురక్షితంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, గ్రామస్తులు తెలిపారు.

రీసర్వే ప్రారంభం

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండలం ఎం బండపల్లి గ్రామంలో సోమవారం రీసర్వే ప్రారంభమైంది. తహసీల్దార్ రమేష్ బాబు, జిల్లా సర్వేయర్ గిరి, డిప్యూటీ తహసీల్దార్ మునిక్రిష్ణ సర్వేను ప్రారంభించారు. రీసర్వే పారదర్శకంగా జరగాలని, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని వారు ఆదేశించారు.

వరసిద్ధునికి రూ.లక్ష విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన నిత్య అన్నదాన ట్రస్టుకు సోమవారం ఓ దాత నగదు విరాళం చేశారు. హైదరాబాద్‌కు చెందిన అర్జున్ రూ.1 లక్ష నగదు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం ఆయనకు ఆలయ అధికారులు స్వామి దర్శనం కల్పించారు.

రెవెన్యూ రికార్డులపై ఇంత నిర్లక్ష్యమా..?



బైకుపై ఉన్న మూట కట్టిన రెవెన్యూ రికార్డులు

పలమనేరు: పట్టణ సమీపంలోని ఆర్డీఓ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి డివిజన్‌లోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది సంబంధిత రెవెన్యూ రికార్డులను దస్త్రంలో చుట్టి ఇక్కడికి తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ఎవరో అధికారి రికార్డులకు ఓ బైక్‌పై పెట్టి వెళ్లారు. దీన్ని గమనించిన అర్జీదారులు రికార్డులంటే అధికారులకు ఇంత నిర్లక్ష్యమా..? ఎవరైనా వాటికి పట్టుకుపోతే పరిస్థితి ఏమిటని చర్చించుకున్నారు.

సిగరెట్ దెబ్బకు రూ.30వేలు నష్టం!



మంటలు ఆర్పుతున్న స్థానికులు

చౌడేపల్లి: నిర్లక్ష్యంగా తాగి పడేసిన ఓ సిగరెట్ మూలాన గడ్డివామి దగ్ధమై సుమారు రూ.30 వేల ఆస్తినష్టం వాటిల్లింది. ఈ ఘటన సోమవారం మండలంలోని కాగతిలో చోటుచేసుకుంది. బాధితుడు గంగులప్ప తెలిపిన వివరాలు..గంగులప్పకు చెందిన గడ్డివామి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి పడేయడంతో మంటలు గడ్డివామికి వ్యాపించాయి. గమనించిన స్థానికులు పుంగనూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారమిచ్చారు. గ్రామస్తులు కలిసి మంటలను ఆర్పారు.

వసంతోత్సవం పరిపూర్ణం



పురవీధుల్లో ఊరేగుతున్న కోదండరాములు

కార్వేటినగరం: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వసంతోత్సవం సోమవారం వైభవంగా ముగిసింది. వేద పండితులు వేకువజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాలసేవ, అర్చన, కొలువు వంటి నిత్యకైంకర్యాలు నిర్వహించారు. వంసతోత్సవాలను పురస్కరించుకుని మధ్యాహ్నం 2 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారితో పాటు కోదండరామ స్వామి వారి ఉత్సవమూర్తులకు వైభవంగా స్నపన తిరుమంజనం చేపట్టారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనాలపై కొలువుదీర్చారు. మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఇంటింటా కర్పూర హారతులు పట్టారు. రాత్రి 9 గంటలకు స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. దీంతో వసంతోత్సవాలు వైభవంగా ముగిశాయి.

భానుడి ప్రతాపం



రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సూర్యుడి ప్రతాపానికి ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడంతో ఎండ నుంచి పశువులు, జీవాలను రక్షించుకునేందుకు పెంపకందారులు నానా తంటాలు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఎండలకు భయపడి మధ్యాహ్నం వేళ బయటకు వెళ్లేందుకు సాహసించడం లేదు. వారం నుంచి అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోడ్లపై జనసంచారం పూర్తిగా తగ్గిపోయింది. పశువులు, జీవాలు ఎండవేడిమిని తట్టుకోలేక నీరసించి, పడుకునేస్తున్నాయి.

– గుడిపాల

వెయ్యి రోజుల సంరక్షణతో పిల్లల సమగ్రాభివృద్ధి





గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న అధికారులు, మత్యం అంగన్‌వాడీ కేంద్రంలో వెయ్యి రోజుల పోషణపై ఏర్పాటు చేసిన ప్రదర్శన

తవణంపల్లె: వెయ్యి రోజుల సంరక్షణతోనే పిల్లల సమగ్ర అభివృద్ధి సాధ్యమని జెడ్పీటీసీ సభ్యులు భారతి అన్నారు. మండలంలోని దిగువ తడకర, ఎగువ మత్యం అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పోషణ్ భీ- పడాయ్ భీ కార్యక్రమం నిర్వహించారు. భారతి మాట్లాడుతూ గర్భవతులు అంగన్‌వాడీ కేంద్రంలో సరఫరా చేసే పౌష్టికాహారాన్ని తప్పక భుజించాలని సూచించారు. సీడీపీఓ నిర్మల మాట్లాడుతూ గర్భవతులు తాజా ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తినాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం గర్భవతులు, పిల్లలు వారే భుజించాలని వివరించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసం, గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శన

మత్యం అంగన్‌వాడీ కేంద్రంలో వెయ్యిరోజుల సంరక్షణపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన చిత్రం ఆకట్టుకొంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో వెయ్యి రోజులు పోషణ, గర్భవతులు, చిన్నారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కళాజాత ద్వారా పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, తల్లులు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను విచారించండి







చిత్తూరు: అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్, తవణంపల్లె: వినతిపత్రం స్వీకరిస్తున్న తహసీల్దార్, గుడిపాల: కిటకిటలాడుతున్న తహసీల్దార్ కార్యాలయం

చిత్తూరు అర్బన్: ప్రజా వేదికలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు, వినతులను క్షేత్రస్థాయిలో విచారించాలని, ఆర్థిక అంశాలతో ముడిపడని వినతులను తక్షణం పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఇంజినీరింగ్, వసతులు, టౌన్ ప్లానింగ్, మెప్మా విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఈ గ్రీవెన్స్‌లో మునిసిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, సహాయ కమిషనర్ ప్రసాద్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

భూ సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తా

తవణంపల్లె: మండలంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలపై వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తానని తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం పలువురు రైతులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వినతులు సమర్పించారు. అరగొండలో వాగు పొరంబోకు స్థలంలో కట్టడాలు ఉన్నాయని సర్వే చేసి సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. వాగు పొరంబోకు స్థలాన్ని సర్వే చేయించి అక్రమ కట్టడాలు ఉంటే తొలగిస్తామన్నారు. చిత్తూరు- అరగొండ ప్రధాన రహదారిలో ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా ఆక్రమణలకు గురైనదని ఎగువ తవణంపల్లె రామచంద్రారెడ్డి అర్జీ ఇచ్చారు. ఆర్అండ్‌బీ అధికారులు ముందుకు వస్తే సర్వే చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఆర్అండ్‌బీ రోడ్డు ఆక్రమణల తొలగింపు కోసం సంబంధిత అధికారులకు రిపోర్టు పంపుతానని పేర్కొన్నారు. తవణంపల్లె జగనన్న కాలనీల్లో వీధిలైట్లు వెలిగించాలని స్థానికులు ఎంపీడీఓ రెడ్డిబాబుకు విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్ కార్యాలయం కిటకిట

గుడిపాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సోమవారం బాధితులతో కిటకిటలాడింది. గ్రీవెన్స్ సందర్భంగా సోమవారం 17 సచివాలయాలకు సంబంధించి వీఆర్‌ఓలు అందుబాటులో ఉండడంతో రైతులు తమ సమస్యలపై కార్యాలయానికి తరలి వచ్చారు. మరికొంత మంది రైతులు వన్‌బీలు సచివాలయాల్లో రావడం లేదని కార్యాలయాలకు వచ్చారు. ఏది ఏమైనప్పటికీ కార్యాలయం మొత్తం కిటకిటలాడింది.

తాగునీటి ఎద్దడి లేకుండా చేస్తాం



వసంతాపురంలో పర్యటిస్తున్న ఏఈ పవన్‌కుమార్

గుడిపాల: మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు గుడిపాల ఆర్‌డబబ్ల్యూఎస్ అసిస్టెంట్ ఇంజినీర్ పవన్‌కుమార్ అన్నారు. వసంతాపురం గ్రామాన్ని సోమవారం ఆయన సందర్శించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రానున్న నేపథ్యంలో ముందస్తుగా గ్రామ సమీపంలో ఉన్న బావి, బోర్‌ను ఆయన పరిశీలించారు. గ్రామస్తులకు నీటి ఎద్దడి లేకుండా ముందస్తుగా బావి, బోర్ల నుంచి కనెక్షన్‌ను అందిస్తామని తెలియజేశారు. ఇందుకు సంబంధించి నివేదికలను సంబంధిత పంచాయతీ కార్యదర్శి సుందరేషన్‌కు ఇవ్వాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడా గానీ తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలియజేశారు. ఇప్పటికే గ్రామాల్లో రిపేరులో ఉన్న చేతిపంపులను కూడా మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. ఆయనతో పాటు గ్రామ సర్పంచ్ రజినీకాంత్ పాల్గొన్నారు.

మొగిలిలో రాహుకేతు పూజలు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయంలో సోమవారం రాహుకేతు పూజలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాహుకాల సమయం ఉదయం 7.30 నుంచి 9 గంటల మధ్య రాహు, కేతు, సర్పదోష నివారణ పూజ కార్యక్రమాలను చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దోష నివారణ చేసుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈఓ మునిరాజ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులు ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

తవణంపల్లె: విద్యార్థినులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని తవణంపల్లె జెడ్పీటీసీ సభ్యులు భారతి అన్నారు. మండలంలోని అరగొండ బాలికల ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ సర్పంచ్ రాజేశ్వరమ్మ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజేశ్వరమ్మ మాట్లాడుతూ అరగొండ ఉన్నత పాఠశాల, బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. జెడ్పీటీసీ భారతి మాట్లాడుతూ బాలికలు, బాలురతో దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అదే స్ఫూర్తితో బాలికలు ఉన్నతంగా రాణించాలని ఆకాక్షించారు. బాలికల హైస్కూల్లో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో అత్యధిక మార్కులు సాధించిన మెరిట్ విద్యార్థినులకు హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాజేశ్వరమ్మ తమ సొంత నిధులతో ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. అనంతరం విద్యార్థినులకు హెడ్‌మాస్టర్ ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మధుకుమార్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ భాగ్యరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్బైడ్‌తో మామిడి పండు చేయడం నేరం

- కాల్షియం కార్బైడ్ వినియోగం, నిల్వ, రవాణా చేస్తే చర్యలు తప్పవు
- జాయింట్ కలెక్టర్ విద్యాధరి హెచ్చరిక



జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో మామిడికాయలు పండ్లుగా మార్చేందుకు కాల్షియం కార్బైడ్ వినియోగించడం నిషేధమని జాయింట్ కలెక్టర్ విద్యాధరి స్పష్టం చేశారు. ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మామిడి కాయలను పండుగా చేసేందుకు వినియోగించే కాల్షియం కార్బైడ్ అమ్మకం, నిల్వ, రవాణా చేయడం చట్టరీత్యానేరమన్నారు. జిల్లాలో ఎక్కడైనా కాల్షియం కార్బైడ్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాని హెచ్చరించారు. తనిఖీల్లో పట్టుబడితే సెక్షన్ 44 ఏ ప్రకారం మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తారని వివరించారు. మామిడి కాయలు కోసిన తర్వాత పండుగా మారడానికి సహజంగా వారం రోజులు పడుతుందన్నారు. కానీ కోసిన వెంటనే పండుగా మార్చేందుకు కాల్షియం కార్బైడ్ అనే రసాయనాన్ని వినియోగిస్తారని, దాని వల్ల కాయల రంగు మారి మెత్తగా అవుతాయని చెప్పారు. పండుగా మారినా నాణ్యత, రుచి ఉండవని చెప్పారు. అలాంటి పండ్లను తినడం వల్ల కాల్షియం కార్బైడ్ విడుదల చేసే ఆరసినిక్ యాసిడ్ రసాయనం వల్ల కాలేయం, మూత్రపిండాల సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. వాంతులు, విరేచనాలు, మత్తుగా ఉండడం, గుండెజబ్బులు, కడుపులో పుండ్లు తదితర ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాల్షియం కార్బైడ్ వినియోగాన్ని నిషేధించిందన్నారు. జిల్లాలోని వ్యాపారులు, రైతులు, చిరువ్యాపారులు ఎవ్వరూ కాల్షియం కార్బైడ్ రసాయనం వినియోగించకూడదని ఆదేశించారు. ఎక్కడైనా కాల్షియం కార్బైడ్ వినియోగిస్తున్నట్లైతే మున్సిపల్ కమిషనర్, ఉద్యానవన శాఖ, పంచాయతీ సెక్రటరీ, మార్కెటింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. మార్కెట్, మామిడి యార్డుల్లో లారీలకు లోడింగ్ చేసే సమయంలో అధికారులు విస్తృత తనిఖీలు చేయాలని ఆదేశించారు. అవసరమైతే ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో శాంపిల్స్ సేకరించి అందులో నిషేధిత రసాయనాలు ఉన్నాయేమో గుర్తించాలన్నారు. ఉన్నట్‌లెతే చట్టపరంగా కఠిన చర్యలకు సిఫార్సు చేయాలని జేసీ ఆదేశించారు.

మేధో సంపత్తిని పెంపొందించే రచనలు

- బంగారుపాళెంలో మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ
- విద్యార్థులే రచయితలు



మంగళవిద్యావాణి 35వ సంచికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

బంగారుపాళెం: రచనలతో మేధోసంపత్తిని పెంచుకునే అవకాశం ఉందని హెచ్ఎం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మంగళ విద్యావాణి 35వ సంచికను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ మురళి హాజరై మాట్లాడుతూ, పుస్తక పఠనం, రచనలు సంపూర్ణ జ్ఞానాన్ని అందిస్తాయన్నారు. పాఠశాల ఆధ్వర్యంలో మంగళ విద్యావాణి అనే మాసపత్రిక నడపడం మారుమూల గ్రామమైన మంగళపల్లె గ్రామానికే గర్వకారణమన్నారు. ఆ ఘనత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులదేనని చెప్పారు. దేశంలో ఏ పాఠశాల ఇలాంటి మాసపత్రిక ఆవిష్కరించిన చరిత్ర లేదని చెప్పారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి సంచిక చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. హెచ్ఎం మాట్లాడుతూ, మాసపత్రికలో అనేక విషయాలను ప్రస్తావిస్తూ కథనాలు అందిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు, మంగళవిద్యావాణి మాసపత్రిక సంపాదకులు అరుణశివప్రసాద్ మాట్లాడుతూ, 2018 నుంచి మాసపత్రికను ప్రారంభించామన్నారు. ప్రస్తుతం 35వ సంచికను ఆవిష్కరించినట్లు చెప్పారు. మంగళ విద్యావాణి మాసపత్రికలో విద్యార్థులే రచయితలుగా, వారి రచనలను ముద్రించి అందిస్తున్నట్లు తెలిపారు. అరుణ్‌శివ ప్రసాద్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు. మాసపత్రికకు నలగాంపల్లెకు చెందిన ధరణీప్రసాద్, విశ్రాంత అధ్యాపకురాలు కుసుమకుమారి ఆర్థిక సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవి, పిళ్లారప్ప, సంపంగి, మోహన్‌రెడ్డి, ధనశేఖర్ భారతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.